క్లుప్తంగా

బాల్ బ్యాడ్మింటన్‌లో భార్గవి ప్రతిభ



ప్రసన్న భార్గవిని అభినందిస్తున్న అధ్యాపకులు

అనపర్తి: అంతర్ జిల్లా జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అనపర్తి జీబీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థిని ప్రసన్న భార్గవి తూర్పుగోదావరి అసోసియేషన్ తరఫున తృతీయ స్థానం సాధించింది. అనంతపురం జిల్లా బత్తలపల్లి మండలం రామాపురంలోని జెడ్పీ హైస్కూల్లో ఈ నెల 12 నుంచి 14 వరకు ఈ పోటీలు జరిగాయి. వీటిలో ప్రతిభ చూపిన ప్రసన్న భార్గవిని శుక్రవారం కళాశాల కరెస్పాండెంట్ టి.ఆదిరెడ్డి (కొండబాబు), ప్రిన్సిపాల్ పీఆర్ఎల్ స్వామి, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌పీ.అబ్బాయిరెడ్డి తదితరులు అభినందించారు.

సూక్ష్మ రుణాలకు దరఖాస్తులు పెంచాలి

బిక్కవోలు: సూక్ష్మరుణాలకు దరఖాస్తుల సంఖ్యను పెంచాలని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి అన్నారు. బిక్కవోలు మహిళ స్త్రీశక్తి భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క డ్వాకా గ్రూపులో ఇద్దరు చొప్పున సూక్ష్మ రుణాలకు దరఖాస్తు చేయని వారికి మరో అవకాశం ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఆర్థిక నిర్వహణపై గ్రామస్థాయిలో శిక్షణ ఇస్తామన్నారు. సంఘాలు తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించడంతో పాటు తీసుకున్న రుణాలతో అభివృద్ధి సాధించడానికి అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో డీపీఎం జనార్ధనరావు, ఏపీఎం సుప్రియ, మండల సమాఖ్య అధ్యక్షురాలు యామాల చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల గురుభక్తి



గురువుకు చిత్రాన్ని అందజేస్తున్న విద్యార్థులు

రాజానగరం: మండలంలోని వెలుగుబందలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన దేవలంక హర్షవర్ధన్, రవికుమార్ అనే ఇద్దరు విద్యార్థులు చిత్రలేఖనం ద్వారా గురుభక్తిని చాటుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న తమ పాఠశాల ఉపాధ్యాయుడు బాస్కెట్ పవన్ కుమార్ చిత్రపటాన్ని పెన్సిల్ ఆర్ట్ వేసి శుక్రవారం ఆయనకు కానుకగా అందజేశారు.

వీఆర్‌ఏల నిరసన

రంగంపేట: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని మండల వీఆర్ఏల సంఘం నాయకులు కోరారు. మండల కేంద్రమైన రంగంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం శాంతియుత నిరసన తెలిపారు. ముందుగా తహసీల్దార్ కోసు అనసూయకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సుబ్బారావు, వీరబాబు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం



సీతానగరం: మండలంలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని రాజమహేంద్రవరం రూరల్ ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేవీబీ నటరాజన్ తెలిపారు. మల్లయ్యపేట - పురుషోత్తపట్నం 33 కేవీ ఫీడర్ లైన్ మరమ్మత్తుల కోసం మిర్తిపాడు సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్లకు సరఫరాను నిలిపివేస్తామన్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ మిర్తిపాడు, ఉండేశ్వరపురం, ములకల్లంక, బొబ్బిల్లంక గ్రామాలకు, ఉపకేంద్రం పరిధిలోని వ్యవసాయ బోర్లకు, ఇండస్ట్రియల్ ఫీడర్‌కు సరఫరా ఉండదన్నారు.

బిక్కవోలు సబ్ స్టేషన్ పరిధిలో..

బిక్కవోలు: బిక్కవోలు సబ్ స్టేషన్ పరిధిలోని బిక్కవోలు హెడ్ క్వార్టర్, ఊలపల్లి, బిక్కవోలు రూరల్, బిక్కవోలు, కానేడు ఇండిస్ట్రియల్, వ్యవసాయ వినియోగదారులకు శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది.

పెదపూడి మండలంలో..

పెదపూడి: మండల పరిధిలోని గ్రామాల్లో ఆర్‌డీఎస్ఎస్, వార్షిక మరమ్మత్తుల పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎస్.ఉదయ భాస్కర్ తెలిపారు. ఆ సమయంలో జి.మామిడాడ, రాజుపాలెం, పైన, వేండ్ర, పెద్దాడ, గండ్రేడు, రామేశ్వరం, ఏపీత్రయం తదితర గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

వానరాల దండయాత్ర

- మెట్ట ప్రాంతంలో కోతుల బెడద
- ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాల ధ్వంసం
- భయపడుతున్న ప్రజలు



రాజానగరంలోని ఓ వీధిలో సంచరిస్తున్న వానరాల గుంపు

రాజానగరం: రియల్ ఎస్టేట్ ప్రభావంతో పంట భూములు, పండ్ల తోటలు తరగిపోతున్నాయి. దీనితో ఆయా తోటలపై ఆధారపడి జీవించే వానరాలు తమ ఆకలి తప్పికలను తీర్చుకునేందుకు ఇళ్లపై దాడులు చేస్తూ జనాన్ని హడలెత్తిస్తున్నాయి. చేతికి దొరికిన వస్తువులను ఎగరేసుకుపోయి, చిందర వందర చేస్తూ బెంబేలెత్తిస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలు, కూరగాయలను ఎత్తుకుపోవడమే కాకుండా ఉప్పు, పప్పు, బియ్యం వంటి వాటిని కూడా తీసుకుపోతున్నాయి.

మెట్ట ప్రాంతంలో..

మెట్ట ప్రాంతంలోని దాదాపు ప్రతి గ్రామంలోనూ వానరాల బెడద నెలకొంది. ముఖ్యంగా జాతీయ రహదారిని ఆనుకుని, నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాజానగరంతో పాటు దివాన్ చెరువు, లాలాచెరువు హెచ్‌బీ కాలనీ, పాలచర్ల, శ్రీరామపురాల్లో వీటి ప్రభావం విపరీతంగా ఉంది. ఇతర గ్రామాల్లోని వానరాలను ఆయా పంచాయతీలు పట్టించి, జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ గ్రామాల్లో రాత్రి సమయాలలో వదిలేస్తున్నారు. దీనితో ఇక్కడ పంచాయతీ సిబ్బంది జనం పోరు పడలేక అడపాదడపా వానరాలను పట్టించి, దూరంగా వదిలేస్తున్నా ఏ ప్రయోజనం ఉండటం లేదు.

తగ్గిపోతున్న తోటల విస్తీర్ణం

సుమారు రెండు దశాబ్దాల క్రితం వరకు గ్రామీణ ప్రాంతాలలో వానరాల బెడద ఎక్కువగా ఉండేది కాదు. ఎందుకంటే ఆ సమయంలో రియల్ ఎస్టేట్ ప్రభావం పెద్దగా లేకపోవడంతో పండ్ల తోటలతో పాటు అపరాల సాగు ఎక్కువగా జరుగుతుండేది. మామిడి, జీడిమామిడి, సపోటా, బత్తాయి, జామ, సీతాఫలం, దానిమ్మ ఇలా అనేక రకాల పండ్ల తోటలు విస్తరంగా ఉండేవి. వీటిపై అనుకూలమైన సమయాలలో దాడి చేసి, తమ ఆహారాన్ని ఆ వానరాలు సంపాదించుకునేవి. కానీ స్పీడు యుగంలో పెరుగుతున్న సాంకేతిక అభివృద్ధితో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. పండ్ల తోటలనే కాకుండా సాగు భూములను కూడా హరించి వేస్తోంది. ఈ తరుణంలో వానరాలకు ఆహారం దొరకడం గగనమై, జనావాసాలకు వచ్చేస్తున్నాయి.

అడవుల్లో వదిలేయాలి

గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న వానరాల బెడదను నివారించాలంటే వాటిని పట్టించి, అడవులలో వదిలేయాలి. కానీ ఆ విధంగా శ్రద్ధ తీసుకునే అధికారులు కనిపించడం లేదు. జనం బాధ పడలేక, కొందరు పెద్దల మాటలను కాదనలేక గ్రామ పంచాయతీ అధికారులు వానరాలను పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. దానిలో చిత్తశుద్ధి లేక అరకొరగానే సాగుతోంది.

– పల్లంకి మనోజ్ కుమారి, ఉద్యోగి, రాజానగరం

హడలెత్తిస్తున్నాయి

ఏమాత్రం ఏమరుపాటుగా ఉంటే చాలు వానరాల దండు ఇళ్లలోకి చొరబడిపోతోంది. వీటిలో పెద్ద వానరాలుంటే జనాన్ని హడలెత్తిస్తున్నాయి. కొట్ట బోతుంటే మీదకు దూకి రక్కేస్తున్నాయి. టపాసులు పేల్చినా ఏమాత్రం భయపడటం లేదు. ఆహార పదార్థాలు, ఇతర సామగ్రిని పాడుచేస్తున్నాయి.

– గరిమెళ్ల తనూజ, గృహిణి, రాజానగరం

డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఏపీయూఎస్ నాయకులు

సీతానగరం: డీఎస్సీ 2025లో ఉపాధ్యాయులుగా ఎంపికైన మండలానికి చెందిన 12 మందిని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సీతానగరం సచివాలయం -1 పక్కనే గల ఎంపీపీ స్కూల్లో ఏపీయూఎస్ మండల శాఖ అధ్యక్షుడు ఫణిబాబు, ప్రధాన కార్యదర్శి కేఎన్‌బీ లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్, ట్రెజరర్ ఎ.ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా కాకినాడ జిల్లా అధ్యక్షుడు శిష్ల చలపతి, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు రామ నగేష్, గౌరవ అధ్యక్షుడు ఎం.రామకృష్ణ విచ్చేశారు. నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్, ఏపీయూఎస్ కేలండర్లు అందించారు. కార్యక్రమంలో ఏపీఎస్‌యూ నాయకులు పీఎస్ ఫణి కుమార్, ఉమామహేశ్వర, రాజేష్, రామదుర్గ, శిరీష, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలి



సూర్యదేవాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు

పెదపూడి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలోని ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణ మూర్తిని మాజీ ఎమ్మెల్యే దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం పండితుల ఆశీర్వచనాలు, స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ముందుగా వారికి వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, మండల కన్వీనర్ గుత్తుల రమణ, గ్రామ కన్వీనర్ మేడపాటి తాతారెడ్డి, గ్రామ కో కన్వీనర్ ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ కర్రి శ్రీవెంకటరెడ్డి, నియోజకవర్గ సచివాలయం విభాగం కన్వీనర్ సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యం, సబ్బెళ్ల వెంకటరెడ్డి, రాయుడు రాఘవ, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



అనపర్తి నుంచి రాజమహేంద్రవరానికి బయలుదేరిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

అనపర్తి: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ శుక్రవారం రాజమహేంద్రవరంలో తలపెట్టిన ఛలో మెడికల్ కాలేజీ నిరసన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ యువజన, విద్యార్థి విభాగం శ్రేణులు భారీగా తరలి వెళ్లాయి. అనపర్తి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు పడాల దుర్గారెడ్డి (ఆర్కే) ఆధ్వర్యంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల నుంచి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఈ ర్యాలీని జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి విజయ్ రెడ్డి, అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట, మండలాల యువజన విభాగం కన్వీనర్లు పులగం వీర్రెడ్డి, సత్తి సత్యనారాయణరెడ్డి (పెద్ద), కొటికలపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బాబుకు నోటీసు



సీతానగరంలో డాక్టర్ బాబుకు నోటీసు అందిస్తున్న ట్రైనీ ఎస్సై సురేష్

సీతానగరం: రాజమహేంద్రవరంలో జరిగే ఛలో మెడికల్ కాలేజీ నిరసనకు వెళ్లరాదంటూ గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర వలంటీర్స్ విభాగం సహాయ కార్యదర్శి పెదపాటి రమేష్‌బాబు (డాక్టర్‌బాబు)కు ట్రైనీ ఎస్సై సురేష్ నోటీసు అందించారు. ఆ కార్యక్రమానికి ఎటువంటి అనుమతులు లేవని, నిబంధనలను అతిక్రమిస్తే క్రిమినల్ చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. ఈ మేరకు అనంతరం డాక్టర్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అనేక విద్యా సంస్కరణలను తీసుకొచ్చారన్నారు. ఆయన తీసుకు వచ్చిన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసి, విద్యార్థుల ఆశలను కూటమి ప్రభుత్వం నీరుగారుస్తోందని దుయ్యబట్టారు.

విద్యార్థినుల ఫీల్డ్ విజిట్



మగ్గం వర్క్‌ను పరిశీలిస్తున్న విద్యార్థినులు

అనపర్తి: విద్యా నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి ఇండస్ట్రియల్ ఫీల్డ్ విజిట్లు దోహదపడతాయని అనపర్తి బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.కల్యాణి అన్నారు. ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష నిర్వహిస్తున్న వృత్తి విద్య కోర్సుల్లో భాగంగా ఎల్ఎన్‌జే స్కిల్స్ సహకారంతో అనపర్తి బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు గురువారం ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ నల్లమిల్లి విజయలక్ష్మి, వైస్ చైర్మన్ తాడి కవిత, మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సులు విద్యార్థులు దాగి ఉన్న నైపుణ్యాన్ని బయటకు తీయడానికి, ఉపాధి అవకాశాలకు ఎంతో తోడ్పడతాయన్నారు. విజిట్‌లో బాగంగా శ్రీసత్య కంప్యూటర్ ఎంబ్రాయిడరీ మగ్గం వర్క్ డిజైన్ షాప్‌ను 80 మంది విద్యార్థినులు సందర్శించారు. కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, పనిచేసే విధానం, ఆపరేటింగ్, చేతితో చేసిన మగ్గం వర్క్, దారం తయారీ విధానం, డయింగ్, డిజైనింగ్, చేనేత వస్త్రాల తయారీపై అవగాహన కల్పించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



డాక్టర్ బాబును సన్మానిస్తున్న శ్రీను, నాగవిష్ణు తదితరులు

సీతానగరం: వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కృషి చేస్తామని కోరుకొండ మండల రైతు విభాగం కన్వీనర్ తోరాటి శ్రీను, వైఎస్సార్ సీపీ గాదరాడ అధ్యక్షుడు పాలెం నాగవిష్ణు అన్నారు. వారిద్దరూ శుక్రవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర వలంటీర్స్ విభాగం సహాయ కార్యదర్శిగా నియమితులైన పెదపాటి డాక్టర్‌బాబును సీతానగరంలోని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను అభినందించి, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల పక్షాన గొంతు వినిపిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. అలాంటి బెదిరింపులకు భయపడే పరిస్థితి లేదన్నారు. నియోజకవర్గంలో మునుపెన్నడు జరగని రీతిలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో సీతానగరం ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, మండల యువజన విభాగం అధ్యక్షుడు కోలా శ్రీను, అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

పోషకాహారంతో మంచి ఆరోగ్యం



విద్యార్థినులు తయారు చేసిన ఆహార పదార్థాలను రుచి చూస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్సిటీలో శుక్రవారం వర్క్‌షాప్ ఆన్ న్యూట్రీషన్ (కిచెన్ కెమిస్ట్రీ) ఫర్ లేడీస్ ప్రోగ్రామ్ జరిగింది. రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ స్థానిక డెక్కన్ విభాగం, యూనివర్సిటీ డిపార్టుమెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, ప్లేస్‌మెంట్ సెల్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా లభించే వివిధ రకాల సరుకులతో పోషకాహారాన్ని తయారు చేయడంలో పలువురు మహిళలు పోటీపడ్డారు. మిల్లెట్ ఆధారిత ఆహార పదార్థాల ప్రదర్శన, పోటీలలో విద్యార్థినులు డ్రై ఫ్రూట్స్ మిక్సర్, లడ్డూలు, సున్నుండలు, మిలెట్స్‌తో ఉప్మా, పలావు, స్వీట్స్ తయారు చేశారు. వాటి రుచులను ఆస్వాదించిన వీసీ ఉత్తమ ఆహార పదార్థాలను ఎంపిక చేసి, వాటిని తయారుచేసిన వారిని విజేతలుగా ప్రకటించి, బహుమతులు అందజేశారు. రాయల్ సొసైటీ చైర్మన్ వి.వీసపాటి మాట్లాడుతూ మన ఇంటిలో లభించే పదార్థాలతోనే రసాయన శాస్త్ర సూత్రాలను ప్రయోగాత్మకంగా అర్థం చేసుకుని, వంట చేయడాన్ని కిచెన్ కెమిస్ట్రీగా పేర్కొన్నారు. చాక్లెట్ తయారీపై పీవీ లక్ష్మి అవగాహన కలిగించారు. కార్యక్రమానికి డాక్టర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి కన్వీనర్‌గా వ్యవహరించారు.

కుక్కల నియంత్రణకు చర్యలు

సాక్షి ఇంపాక్ట్

బిక్కవోలు: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నెలకొన్న కుక్కల బెడదపై సాక్షి పత్రికలో కుక్కల స్వైర విహారం అనే శీర్షికతో శుక్రవారం ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు స్పందించారు. ఆ మేరకు ప్రకటన విడుదల చేశారు. తొస్సిపూడి, కొమరిపాలేల్లోని కుక్కకాటు బాధితులకు సంబంధిత పీహెచ్‌సీల్లో ప్రథమ చికిత్స చేసి, ఏఆర్‌వీ ఇంజెక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయా పంచాయతీ సిబ్బందిని కోరామన్నారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏఆర్‌వీ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

డీఏ బకాయిలు చెల్లించాలి

రాజానగరం: దసరా కానుకగా ఉద్యోగులకు డీఏ బకాయిలు చెల్లించాలని ప్రోగ్రసివ్ రికగ్నైజ్డ్ టీచర్ యూనియన్ (పీఆర్‌టీయూ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు శుక్రవారం జరిగిన మండల శాఖ సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.అగ్నేష మాట్లాడుతూ దీనితో పాటు పీఆర్‌సీ కమిషన్‌ని వేసి ఐఆర్ ప్రకటించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు పి. రాజారావు మాట్లాడుతూ డీఎస్సీ 2025 నియామకాలకు ముందుగానే ఇంటర్ డిస్ట్రిక్ట్ బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధులు దుర్గాప్రసాద్, సాంబశివరావు, నాగేశ్వరరావు, ఎస్‌వీ ప్రసాద్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, నరసింహమూర్తి పాల్గొన్నారు.

చినకొండేపూడిని ముంచెత్తిన తొర్రిగెడ్డ కాలువ



ముంపునకు గురైన చినకొండేపూడిలోని ఓ వీధి

సీతానగరం: తొర్రిగెడ్డ కాలువ నుంచి వచ్చిన నీటితో మండలంలోని చినకొండేపూడి ముంపునకు గురైంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువపై ఉన్న ఉన్న రెగ్యులేటర్ మరమ్మతులకు గురైందని, దాన్ని వేసవిలోనే బాగు చేయడం కుదురుతుందని అధికారులు చెబుతున్నారు. పురుషోత్తపట్నంలోని తొర్రిగెడ్డ పంపింగ్ స్కీమ్ నుంచి ప్రధాన కాలువ నుంచి కుడి, ఎడమ కాలువలుగా వేరవుతాయి. కుడి కాలువకు సింగవరం దాటిన అనంతరం సబ్ కాలువ ఉంది. ఈ సబ్ కాలువ నుంచి చిన్న కాలువ ద్వారా చినకొండేపూడిలోని షిర్డీ సాయిబాబా ఆలయాన్ని ఆనుకుని కాపుల రామాలయం మీదుగా చీపురుపల్లి రోడ్డు నుంచి పంట పొలాలకు సాగునీరుగా ప్రవహిస్తుంది. అయితే కాపుల రామాలయం వద్ద కాలువలో పూడికతీత పనులు చేయకపోవడంతో నీటి ప్రవాహం ఆగిపోయి, చీపురుపల్లి - చినకొండేపూడి రోడ్డుపైకి చేరింది. అలాగే కాలువను ఆనుకుని ఉన్న వీధిలోకి నీరు వెళ్లడంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్



కోరుకొండలో నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖర్లు

బిక్కవోలు: పని విధానంలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను, లోపాలను పరిష్కరించాలంటూ మండలంలోని దస్తావేజు లేఖర్లు శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారి సంఘ అధ్యక్షుడు మజ్జి గణపతిరావు మాట్లాడుతూ దస్తావేజుల లేఖర్ల రాష్ట్ర సంక్షేమ సంఘం పిలుపు మేరకు ఈ నిరసన చేపట్టామన్నారు. అనంతరం సబ్ ఇన్‌స్పెక్టర్ రవిచంద్రకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చినబాబు, కార్యదర్శి వాసంశెట్టి బాలాజీ కుమార్, కోశాధికారి సీతారామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఓటీపీ విధానాన్ని విరమించుకోవాలి

కోరుకొండ: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటీపీ విధానాన్ని విరమించుకోవాలని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లేఖర్లు శుక్రవారం మొదటి రోజు పెన్‌డౌన్ నిర్వహించారు. దస్తావేజు లేఖర్ల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్ర, శనివారాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆ సంఘ అధ్యక్షుడు పెదపాటి భీమరాజు మాట్లాడుతూ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఓటీపీ, ఆటోమిటేషన్ వల్ల కక్షిదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైవీఎస్ఆర్ కృష్ణ, జాజుల రాజా, కోట చక్రధర్, పుణ్యమూర్తుల నరసింహారావు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే సమాజ అభ్యున్నతి

అనపర్తి: మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజ అభ్యున్నతి సాధ్యమవుతుందని అనపర్తి ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.రామ గుర్రెడ్డి అన్నారు. స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహిళలకు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 600 మందికి వైద్య సేవలు అందించారు. డాక్టర్ పద్మశ్రీ మాట్లాడారు. అనంతరం టీబీ రోగులకు పౌష్టికాహారం అందజేశారు.

రంగంపేట: మహిళలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వేణు శ్రీలక్ష్మి అన్నారు. వడిశలేరు గ్రామంలోని సచివాలయం-1 వద్ద శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 404 మంది మహిళలకు వైద్యసేవలు అందించారు. సింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నల్లమిల్లి గ్రామంలో డాక్టర్ సంకీర్తన ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 152 మందికి వైద్య సేవలు అందించారు.

బిక్కవోలు: మహిళల ఆరోగ్యమే కుటుంబానికి రక్ష అని కొంకుదురు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. పందలపాక సచివాలయం -2 వద్ద నిర్వహించిన శిబిరంలో 102 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేశారు.

సీతానగరం: ముగ్గళ్లలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 122 మందికి డాక్టర్ ఈ.ఏసు రాణి వైద్యసేవలు అందించారు.